# పితృదేవోభవ

**-డా. సి.యం. అనూరాధ**

టెక్సాస్‌లో మూడురోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్‌ల సెమినార్‌కు అధ్యక్షత వహించి విజయవంతంగా ముగించి అమెరికా అధ్యక్షునిచే సత్కారం పొంది నిన్ననే ఇండియాకు తిరిగి వచ్చాను. ఈ సందర్భంగా నాకు హైదరాబాద్‌లో గొప్ప సన్మానం ఏర్పాటు చేసారు. సిటీలోని రాజ్ హాస్పిటల్స్‌లో పేరు మోసిన కార్డియాలజిస్ట్‌ను నేను. నా అపాయింట్‌మెంట్ కోసం కొన్ని నెలలు వెయిట్ చేయవలసి వుంటుంది. అంతటి బిజీ షెడ్యూల్ నాది. హార్ట్ సర్జరీలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి సరికొత్త ఎక్విప్‌మెంట్ ఆధారంగా సులభంగా ఆపరేషన్స్ చేయడం కనుగొన్నందుకు నాకు అమెరికా అధ్యక్షుని నుంచి ఆహ్వానం అందింది.

నా పేరు ప్రపంచమంతా మారుమ్రోగిపోయింది. ఇండియాలోనే మొదటిసారిగా ఇలాంటి ప్రిస్టేజియస్ ఆఫర్ అందుకున్నందుకు అతి గొప్పగా నా సన్మానానికి ఏర్పాట్లు చేస్తున్నారు మా హాస్పిటల్ మేనేజ్‌మెంట్. సిటీలోనే పెద్దదైన ఫంక్షన్ హాల్లో సన్మాన సభను ఏర్పాటు చేసారు. చీఫ్ గెస్ట్‌గా రాష్ట్రపతిని ఆహ్వానించారు.

ఈరోజు సాయంత్రం ఐదుగంటలకు కార్యక్రమం మొదలవుతుంది. నేను కాస్త ముందుగానే అక్కడికి చేరుకున్నాను. వేదిక అట్టహాసంగా అలంకరించబడింది. రాష్ట్రపతి, ముఖ్యమంత్రితోపాటు ఎంతోమంది వివిఐపిలు ఆసీనులై ఉన్నారు. ఎంతోమంది మిత్రులు, హితులు, సన్నిహితులు, కొన్నివేలమంది నా సన్మానసభకు హాజరయ్యారు.

సభా కార్యక్రమం ప్రారంభమయింది. ఒక్కొక్కరి ప్రసంగాలు మొదలయ్యాయి. అందరూ నా గురించి గొప్పగా పొగుడుతున్నారు.

ఒక విధంగా చెప్పాలంటే అంతా నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ప్రసంగాలన్నీ అయిపోయాయి. తరువాతి కార్యక్రమం రాష్ట్రపతిచే నాకు సన్మాన కార్యక్రమం. వేలమంది సన్నిహితుల కరతాళధ్వనుల మధ్య నేను లేచి నిలబడ్డాను. రాష్ట్రపతిగారు నాకు సన్మానం చేయడానికి ముందుకు వచ్చారు.

"సర్! ప్లీజ్... వన్ మినిట్'' ఆయనను రిక్వెస్టింగ్‌గా అడిగాను. అర్థం కానట్టు చూసారాయన.

"సర్! నిజానికి ఈ సన్మానం అందుకోవాల్సిన వ్యక్తి నేను కాదు. ఆయన ఇక్కడే ఉన్నారు. ఆయనను ఇక్కడకు తీసుకువస్తాను. ప్లీజ్. ఆ సన్మానం, ఆ గౌరవం ఆయనకే చెందాలి''

రాష్ట్రపతితోపాటు ఆహుతులందరూ ఆశ్చర్యంగానూ, అయోమయంగానూ చూస్తున్నారు.

గబగబా స్టేజీ దిగి ముందు వరుసలో వున్న మా నాన్నగారిని స్టేజీమీదకు తీసుకువచ్చాను. ఆయన పాదాలనంటి నమస్కరించాను. అంతా నన్ను వింతగా చూస్తున్నారు.

"సర్! ఈయన మా నాన్నగారు. నేనీనాడు ఈ అత్యున్నత పురస్కారం అందుకున్నానంటే అందుకు పూర్తిగా ఆయన సహకారం, త్యాగమే కారణం. కాబట్టి దయచేసి నాకు చేయవలసిన సన్మానం ఈ మహనీయునికి చేయండి'' రాష్ట్రపతిగారిని అభ్యర్థించాను. వేలాదిమంది ప్రజల కరతాళధ్వనుల మధ్య ఆయన మా నాన్నగారిని సత్కరించారు. నాకళ్లవెంట ఆనంద భాష్పాలు కారిపోతున్నాయి.

అందరూ నన్ను మాట్లాడమన్నారు.

"తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలంటారు. ఈ ప్రపంచంలో నాకు అత్యంత ఆప్తులు మా నాన్నగారు. ఆయన లేకుంటే నాకు ఈ జీవితమే లేదు. భగవంతుడిని నేను కోరుకునేది ఒక్కటే. ఎన్ని జన్మలెత్తినా ఆయన కూతురిగానే పుట్టించమని'' అంటూ నా స్పీచ్ మొదలుపెట్టి హార్ట్ సర్జరీ గురించిన విశేషాలతో ముగించాను. తరువాత మా నాన్నగారిని మాట్లాడమన్నారు. నాన్నగారు మెల్లగా లేచి మైక్ అందుకున్నారు.

"నా కుమార్తె సాధించిన ఈ విజయం ఎంతో గర్వకారణం. తనను మనసారా అభినందిస్తున్నాను. పిల్లలు తెలిసో తెలియకో తప్పులు చేస్తుంటారు. మనం వాటిని సరిదిద్దుకోవడం నేర్పాలి. అంతేగానీ తప్పు చేసారుకదాని శిక్ష విధించకూడదు. పిల్లల్ని మనం క్షమించగలగాలి. వాళ్ల తప్పుల్ని క్షమించి అక్కున చేర్చుకోవాలి. వారు చేసిన తప్పుల్ని వారే దిద్దుకోవడం నేర్పాలి. అందుకు సరైన దారి చూపించాలి. ఇంతకంటే నేను మాట్లాడవలసింది ఏమీలేదు. అందరికీ నా వందనాలు'' అంటూ ముగించారు.

ఎలాగైతేనేం మొత్తానికి నా సన్మాన కార్యక్రమం అట్టహాసంగా ముగిసింది. నేను నాన్నగారితో కలసి ఇంటికి చేరుకున్నాను. అప్పటికి రాత్రి బాగా పొద్దుపోయింది.

ఇద్దరం భోజనం చేసి చల్లగా వుంటుందని డాబామీదకెళ్లి కూర్చున్నాం. నక్షత్రాలతో నిండిపోయిన నింగి అందాల్ని నిశ్శబ్దంగా ఆస్వాదిస్తున్నాం. వెన్నెల చల్లగా, హాయిగా శరీరాల్ని, మనసునీ స్పృశిస్తోంది. మెల్లగా నాన్న ఒళ్లో తల పెట్టుకుని పడుకున్నాను. ఎంత హాయిగా

ఉందో! కాసేపటికి నాన్నగారు తూగుతున్నట్లు అనిపించింది. ఆయనకు పక్క ఏర్పాటుచేసి నేనలాగే వెన్నెల్లో తడుస్తూ కూర్చున్నాను. ఎందుకో మరి ఈ రోజు నిద్ర రాలేదు. నిద్రలేని రాత్రులు నాకేమీ కొత్తకాదు. జీవితంలో ఎన్నో రాత్రిళ్లు మేలుకునే గడిపాను. ఈ రోజు పాత జ్ఞాపకాలన్నీ అదేపనిగా గుర్తుకు వస్తున్నాయి. ఆ జ్ఞాపకాల పొరల్ని వరుసగా ఆవిష్కరించుకుంటూ కూర్చున్నాను.

★★★

మా ఇంట్లో చాలా సంవత్సరాల తరువాత పుట్టిన ఆడపిల్లని కావడంతో ఇంట్లోవారికందరికీ గారాలపట్టీనయ్యాను. నాకంటే ముందు ముగ్గురు అన్నయ్యలు ఉండేవారు. నాన్నగారి కుటుంబంలో నాన్నగారే చిన్నవారు.



ఆయనకూ ఇద్దరన్నయ్యలు. వాళ్లిద్దరికీ కూడా అమ్మాయిలు లేరు. అటు అమ్మవైపు వాళ్లక్కూడా ఎవరికీ అమ్మాయిలు లేరు. అందువల్ల నానమ్మ, తాతయ్యలు, పెద్దమ్మ, పెదనాన్నను, మామయ్యలు అందరికీ నేను అపురూపం. అమ్మానాన్నలకయితే మరీనూ. ఎంతో ప్రేమగా గుండెలమీద పెట్టుకుని పెంచారు నన్ను.

నేను చిన్నప్పటినుంచీ దేనికీ మొండి చేయడం, అల్లరి చేయడం చేసేదాన్ని కాదు. ఎవరేం చెప్పినా వినేదాన్ని. ప్రతి క్లాసులో ఫస్ట్ వచ్చేదాన్ని. దానికితోడు నా గొంతు చాలా బాగుండేది.

'భగవంతుని వరం, మీ పాప స్వరం' అని మా గుడి పూజారిగారు నాకు సంగీతం చెబుతానని నాన్నని ఒప్పించి మరీ నాకు సంగీతం నేర్పారు. తీయని గొంతుతో పాటలు పాడుతూ ఇంటివారినందరినీ మెప్పించేదాన్ని. అందరి బర్త్‌డేలు, మ్యారేజ్‌డేస్ నోట్ చేసుకుని ఎవరి బర్త్‌డే వచ్చినా నా పాటతో వాళ్లకి మేలుకొలుపు పాడేదాన్ని. నాకు మా ఇల్లంటే చాలా ఇష్టం.


## ఎవరెస్టు ఫేమిలీ

1953లో ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నార్కేతో కలిసి మొదటిసారి ఎవరెస్టును అధిరోహించి చరిత్ర సృష్టించి పర్వత సాహసయాత్రలకి నాందీ పలికిన సంగతి తెల్సిందే! ఆ తర్వాత నేపాల్‌లో షేర్పా జాతీయులకోసం సాయపడే ప్రతియేటా 2.5 లక్షల డాలర్ల ట్రస్టును ఏర్పాటుచేసి హిల్లరీ అనేక స్కూళ్లు, హాస్పిటల్స్ కట్టించాడు. 88వ ఏట చనిపోయేదాకా ప్రతియేటా నేపాల్‌కి వచ్చిపోతుండేవాడు. తర్వాత అతని కొడుకు పీటర్ కూడా రెండుసార్లు ఎవరెస్టునెక్కటంలోనే కాకుండా షేర్పాలకి సేవచేయటంలో తండ్రి అడుగుజాడలలో నడుస్తున్నాడు. ఇటీవల అతనితో కలిసి మొదటిసారి నేపాల్‌కి వచ్చిన కూతురు 18ఏళ్ల అమీలియా తన తండ్రి తాతలలాగునే షేర్పాజాతికి సేవ చేస్తానంది. నేపాల్‌లో ఇంకా ఎన్నో వెనకబడిన ప్రాంతాలున్నాయని వాటి అభివృద్ధి విషయం తను చేపడతానంది. అంతే కాకుండా తన తండ్రి తాతలులాగునే ఏదోనాడు ఎవరెస్టును అధిరోహించగల ఆశాభావాన్ని వ్యక్తం చేసింది!

## ఏంటి యేటర్ ఫీట

దక్షిణ అమెరికా ప్రాంతాల్లో ఏంటియేటర్ (పురుగుల్ని, కొణుజుల్ని తిని బ్రతికే జంతువు)లు కనిపిస్తాయి. అలాంటి దానికి తర్ఫీదునిస్తే టోక్యోలో ఇటీవల జరిగిన ఒక షోలో అది రోప్‌ట్రిక్ చేసి అందర్నీ అలరించింది!

-తటవర్తి




అందరం కలసి ఉండే మా ఇల్లు ఓ పవిత్రమైన గుడిలా అనిపించేది.

ప్రతి క్లాస్ ఫస్ట్ ర్యాంకుతో పాసవుతూ పదో తరగతికి వచ్చాను. టీచర్స్ అంతా నా తెలివితేటలకు ఆశ్చర్యపోయేవారు. మీ అమ్మాయికి స్టేట్ ర్యాంక్ వస్తుందని నాన్నగారితో చెప్పేవారు. వాళ్ల మాటలు వమ్ముకాలేదు. టెన్త్ ఫలితాలలో నాది స్టేట్ థర్డ్ ర్యాంక్. మా టీచర్స్ అందరూ అంతా ఎంతగానో అభినందించారు.

ఇంటర్ మా ఊళ్లోనే ఉన్న కాలేజీలో చేరాను. అక్కడ బైపిసి గ్రూప్ తీసుకున్నాను.

కాలేజీలో లెక్చరర్స్ కూడా నాన్నగారితో చెప్పేవారు మీ అమ్మాయికి తప్పకుండా మెడిసిన్‌లో సీటు వస్తుందని. ఆ మాటలకే నాన్నగారు నేను అప్పుడే డాక్టర్ అయిపోయినట్లు మురిసిపోయేవారు. పాపం మా నాన్నగారికి చిన్నప్పుడు డాక్టర్ కావాలనే కోరికగా ఉండేదిట. కానీ వాళ్ల నాన్నగారు అర్థాంతరంగా చనిపోవడంవల్ల ఆయనను చదివించేవారులేక, సంపాదనకు మరో మార్గం లేక ఓ స్కూల్ టీచర్‌గా సెటిలయ్యారు. అందువల్ల ఆయన నేను డాక్టర్ కావాలని ఎంతగానో కోరుకునేవారు. అలా ఆనందంగా సాగిపోతున్న నా జీవితం చూసి విధికి కన్ను కుట్టింది. వినీత్ రూపంలో నా జీవితంలో ప్రవేశించి నన్ను దెబ్బ తీసింది. వినీత్ ఇంటర్ సెకెండ్ ఇయర్ పరీక్షల ముందు పరిచయమయ్యాడు.

నేను వెళ్లే బస్‌లోనే వచ్చేవాడు. ఓరోజు బస్‌లో నన్ను ఒకతను అల్లరి చేయబోతే వినీత్ అడ్డుపడ్డాడు. అలా వినీత్‌తో పరిచయమైంది. తరువాత నాకేమైందో, అతనిలో ఏ వశీకరణ మంత్రం ఉందో నాకే తెలీదు. ప్రతిరోజూ అతడికోసం ఎదురు చూడడం అలవాటయింది. ఒక్కరోజు అతను కనిపించకపోయినా దిగులుగా ఉండేది.

క్రమంగా అతడితో మాటలు మొదలయ్యాయి. అయితే ఒక్కరోజు కూడా అతడితో పార్కులకుగానీ షికార్లకుగానీ వెళ్లలేదు. అలాగని నా చదువును నిర్లక్ష్యం చేయలేదు. ఇలా ఉండగా ఒకరోజు అతను సడెన్‌గా అన్నాడు 'మనం పెళ్లి చేసుకుందాం' అని.

నా సమాధానం కోసం ఎదురుచూడకుండా అతనే చెప్పాడు.

"మీ ఇంట్లో ఈ విషయం చెప్పావంటే ఎలాగూ వాళ్లు ఒప్పుకోరు. అనవసరంగా గొడవ అవుతుంది. నీ చుట్టూ నిఘా వేస్తారు. ఇదంతా ఎందుకు? సింపుల్‌గా మనం ఎట్లైనా వెళ్లిపోయి పెళ్లి చేసుకుందాం. పెళ్లి చేసుకుని వస్తే వాళ్లేమీ చేయలేక మనల్ని ఆహ్వానిస్తారు'' అని అన్నాడు.

"మరి నా చదువు, కాలేజీ...'' అని నేనంటుంగానే మధ్యలోనే అందుకుని అన్నాడు.

"నిన్ను నేను చదివిస్తాగా. నీవేం చదవాలన్నా చదివిస్తాను. నన్ను నమ్ము'' వేడుకోలుగా అన్నాడు. "ఈ రోజు రాత్రి 12 గంటలకు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లిపోదాం. సరిగ్గా 12 గంటలకు నువ్వు వచ్చేయి. నేను మీ ఇంటి ముందు వుంటాను'' అని చెప్పి వెళ్లిపోయాడు.

నాకు ఆలోచించుకునే వ్యవధి కూడా లేదు. నేనలాంటి పని చేస్తానని మా ఇంట్లోవాళ్లు కాలేజీలో లెక్చరర్స్, ఫ్రెండ్స్ మాత్రమేకాదు, నేను కూడా అనుకోలేదు.

ఏ దుష్టశక్తి నన్ను ఆవహించిందో, ఏ ఘైకంలో పడిపోయానో నాకే తెలీదు. రాత్రి 12 గంటలకు అతన్ని అనుసరించాను.

***

ట్రైన్ కదిలింది.

రైలు వెళ్తూ ఉంటే అప్పుడు నా మెదడు పని చేయడం మొదలుపెట్టింది.

అతడా సాయంత్రం ఆ విషయం చెప్పినప్పటినుంచీ అర్ధరాత్రి ఇంట్లోంచి బయటపడేదాకా నేనే ఏదో ట్రాన్స్‌లో వున్నట్టున్నాను. ఇప్పుడు నా మనసు ఆలోచిస్తోంది. అమ్మానాన్నల ప్రేమ, వాళ్లు నామీద పెట్టుకున్న ఆశలు అన్నీ వరుసగా గుర్తుకొస్తున్నాయి. ఎలాంటి కుటుంబం మాది? పరువుకు ప్రాణాలు పెట్టే కుటుంబం.

ఊళ్లో పదిమందికి ఆదర్శంగా ఉండే కుటుంబం. అలాంటి కుటుంబానికి ఎంత అప్రదిష్ఠ తెచ్చే పని చేస్తున్నాను. ఎంత పొరపాటు జరిగింది. ఉదయం లేస్తే వినీత్‌తో వెళ్లిపోతున్నానని నేను వ్రాసిపెట్టిన లెటరు చూసి అమ్మానాన్నల గుండె పగిలిపోతుందేమో? ఊళ్లో వాళ్లంతా మా కుటుంబాన్ని చూసి నవ్వుతారేమో? ఆలోచిస్తుంటే నేనెంత దారుణమైన పనికి ఒడిగట్టానో అర్థమయింది.

నాకేం చేయాలో తోచలేదు. అయితే ఒక్కటి... వెంటనే ఇంటికి తిరిగి వెళ్లిపోవాలనుకున్నాను. ఏదో స్టేషన్ వచ్చింది. విండోలోంచి చూస్తుండగా ప్రక్క ప్లాట్‌ఫామ్ మీద మా ఊరిమీద వెళ్లే ట్రైన్ కనిపించింది. టైమ్ చూస్తే ఉదయం నాలుగుగంటలయింది. వినీత్ మంచి నిద్రలో ఉన్నాడు. ఇంకేం ఆలోచించలేదు. ఒక్క ఉదుటున ట్రైన్ దిగి పక్క ట్రైన్ ఎక్కేసాను. నేను ఇంటికి చేరేసరికి ఇంటి ముందు జనం.

నన్ను చూడగానే అందరి ముఖాల్లో ఆశ్చర్యం. అంతకంటే ఎక్కువ అసహ్యం. అమ్మా, అన్నయ్యలు, బంధువులు అంతా నోటికొచ్చినట్లు తిట్టారు. నన్నో ఘోర పాతకిలా చూసారు.

"నిన్ను తీసుకెళ్లినవాడు వదిలేసి వుంటే ఏ రైలు కిందో పడి చావకపోయావా? ఇంటికెందుకొచ్చావ్? మేము చచ్చామో లేదో చూడడానికొచ్చావా?'' అంటూ నిలదీసారు.

వారందరి దృష్టిలో నేను చెడిపోయినదాన్నయ్యాను. తెలిసీ తెలియని వయసులో వయసుకు మించిన తెలివితేటలతో ఇల్లు వదిలి వెళ్లి ఎంత తప్పు చేసానో అర్థమయింది. నా ఉనికి తలచుకుంటేనే వణుకు వస్తోంది. రేపట్నుంచి కాలేజీకి ఎలా వెళ్లాలి? అందరి దృష్టిలో చాలా చులకనయ్యాను. ఈ అవమానంతో ఎలా బ్రతకాలి? ఇకనుంచి అన్నీ వదిలేసి బాగా చదువుకోవాలి. తప్పకుండా మెడిసిన్‌లో సీటు తెచ్చుకుని డాక్టర్‌ను కావాలి అనుకున్నాను. ఆ మాట అమ్మకు ప్రామిస్ చేయాలనుకున్నాను. కానీ అమ్మ నేను తన దగ్గరకు వెళ్లగానే ఎంతో అసహ్యించుకుంది. నా ముఖమే తనకు చూపించవద్దంది. అంతేకాదు, 'మా ఇంట్లో నీకు చోటు లేదు, నీ ఇష్టం వచ్చినచోట ఊరేగు' అని చెప్పింది. హతాశురాలనయ్యాను.

నిజానికి అలా అనడంలో అమ్మ తప్పేంలేదు. నేను చేసిన పనికి ఎవరైనా అలాగే అని ఉండేవారు. నవమాసాలు మోసి, కనుపాపలా పెంచి నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిని అలా వంచించాను నేను. ఆ అమృతమూర్తి గుండెలు ముక్కలు చేసాను.

అమ్మ నన్నలా అసహ్యించుకోవడమే కరెక్ట్ అనిపించింది. నన్నెవ్వరూ మాట్లాడించడంలేదు. నా నీడ వాళ్లమీద పడినా పాపం అంటుతుందేమో అన్నట్లున్నాయి అందరి చూపులు.

"గుండెలమీద పెట్టుకుని పెంచాను ఒక్కతే కూతురని. అటువంటి ప్రేమమూర్తుల గుండెలు ముక్కలు చేసింది చూడండి ఈ రాక్షసి''

"చూడడానికి ఎంత అమాయకంగా ఉందో ఈ వయసుకే ఇంత పని చేసింది. ఒక్కగానొక్క చెల్లెలు అని ఆ అన్నలు ఎంత ముద్దు చేసేవారో? ఇంతమందిని కాదనుకుని వాడితో ఎలా వెళ్లిందో?''

ఇలా బంధువుల మాటలు నాకు ముల్లుల్లా గుచ్చుకుంటున్నాయి. నిజమే వాళ్లన్న మాటల్లో ఒక్కటి కూడా తప్పులేదు. అందుకే నాకు ఎవరిమీదా కోపం రాలేదు. వాళ్లంతా నన్ను ఇంకా బాగా తిట్టాలి అనుకున్నాను.

కాసేపటికి గుర్తుకువచ్చింది. నాన్న కనిపించడంలేదు. నాన్నకేమైంది? ఎలా ఉన్నారు? ఎవరినడగాలన్నా భయంగా ఉంది. మెల్లగా అన్నయ్య కొడుకును పిలిచి అడిగాను. నా ఉత్తరం చూసినప్పటినుంచి జ్వరంతో అలా తెలివిలేకుండా పడి ఉన్నారుట. నాకు చాలా దిగులుగా అనిపించింది. నేను పుట్టి బుద్ధి ఎరిగినప్పటి నుంచీ నాన్న జ్వరంతో పడిపోవడం ఏ రోజూ చూడలేదు. చివరకు ఈ రోజు నావల్ల ఆయన ఇలా అయిపోయారా? నాన్న కూడా లేచి అందరిలా నన్ను తిడితే బావుండుననిపించింది.

కాసేపటికి నాన్నగారు లేచారని కలకలం మొదలైంది. ఆయనకు నేను వచ్చిన సంగతి తెలిసినట్లుంది. ఎవరెంతగా చెబుతున్నా వినకుండా నా దగ్గరకొచ్చారాయన.

నాన్నను చూస్తుంటేనే నా గుండె ద్రవించిపోయింది. ఒక్కరోజుకే ఎన్నో లంఖనాలు చేసినట్లు అయిపోయారు.



## అభిమానం చాలు

కుష్బూ కోసం గుడి కట్టి పూజలు నిర్వహించారు తమిళ సినీ ప్రేక్షకులు. అలాగే సిమ్రాన్ హీరోయిన్‌గా వీరవిహారం చేస్తున్న రోజుల్లో ఆమె విగ్రహం పెట్టి గుడి కట్టడానికి అభిమానులు చేసిన ప్రయత్నాలు సిమ్రాన్ కాదనడంవల్ల ఆగిపోయాయి. తమిళనాట క్రేజీ హీరోయిన్ నమితకి గుడి కట్టడానికి అభిమానులు రెడీ అయి ఆ సంగతి ఆమెకి చెప్పారట. అయితే నమిత మాత్రం అలాంటి పనులేమీ చేయవద్దని, ఇంతగా అభిమానిస్తున్నందుకు కృతజ్ఞతలు అంటూ వారి ప్రయత్నాన్ని విరమింపచేసిందిట.



నేనేం మాట్లాడకుండా ఆయన్నే చూస్తూ ఉండిపోయాను. మాటలు వ్యక్తపరచలేని భావాలను కళ్లు పలకరిస్తున్నాయి.

"అమ్మా పవిత్రా! నాన్నగారు ఒక్కుదుటున నా దగ్గరకు వచ్చి నన్ను అక్కున చేర్చుకున్నారు.

నేనాయన గుండెల్లో పసిపాపలా ఒదిగిపోయాను. నా గుండె కరిగి కన్నీరై ప్రవహిస్తోంది. నెమ్మదిగా నేనాయన పాదాలమీద జారగిలబడ్డాను. నా కన్నీటితో ఆయన పాదాలు తడిసిపోతున్నాయి. నన్ను నేను ప్రక్షాళన చేసుకుంటున్నాను.


నా శరీరమంతా ఏమీ లేకుండా నీరే ఉన్నట్లు ఎంతసేపయినా నా కళ్లు స్రవిస్తూనే ఉన్నాయి. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. నా మనసు కాస్త తేరుకున్నట్లయింది.

"ఆ మహామనిషి పాదాలు తగలడానికి కూడా నీకు అర్హత లేదు. ముందు ఆయన పాదాలు వదిలి ప్రక్కకు వెళ్లు" కళ్లనిండా, గొంతు నిండా అసహ్యంతో మామయ్య నన్ను దూరంగా నెట్టివేసాడు.



## త్వరలోనే పెళ్లి?

కరీనా కపూర్-సైఫ్ అలీ ఖాన్‌ల ప్రేమాయణం-పెళ్లి కథ ఇటీవల కాస్త సద్దుమణిగిందో లేదో మళ్లీ వార్తలకెక్కింది. 'నా వరకు నేను ఇప్పుడంటే ఇప్పుడు ఈ క్షణంలో కరీనాని పెళ్లి చేసుకోగలను. కానీ కరీనాకి తన కమిట్‌మెంట్స్ కూడా వున్నాయి కదా' అంటున్నాడు సైఫ్. కానీ అతి త్వరలోనే మా పెళ్లి వార్తను మేము చెప్తామనే అనుకుంటున్నాము అని కూడా సెలవిస్తున్నాడు. కేవలం ఈ కబుర్లన్నీ పబ్లిసిటీ కోసమా? నిజంగానేనా? అనే సందేహాలు ఎవర్కైనా కలుగుతాయి.




నాన్నగారు దెబ్బతిన్నట్లు చూసారు.

"కన్నా! ఇలారా" మెల్లగా నన్ను పిలిచారు.

"బావగారూ!" ఆశ్చర్యంగానూ, కంపరంగానూ పిలిచారు మామయ్య.

"దాంతో మీకు మాటలేంటి? దాన్నెవ్వరూ దగ్గరకు రానీయవద్దు" మామయ్య మాటలు వినిపించుకోకుండా నాన్న నన్ను అక్కున చేర్చుకున్నారు. మామయ్య కోపంగా వెళ్లి అమ్మను, అన్నయ్య, వదినెలను తీసుకుని వచ్చారు.

"మన పరువు ప్రతిష్ఠలను, గౌరవాన్ని మంటగలిపిన ఈ రాక్షసి ఇంట్లో ఉండడానికి వీల్లేదు. ముందు దీన్ని ఇంట్లోంచి పంపించివేయండి" అమ్మ అరిచింది.

"సరళా! ఇది మన కన్నబిడ్డ. దాన్ని ఇంట్లోంచి పంపించివేస్తావా?" ఆవేదనగా అన్నారు.

"లేకపోతే నెత్తిన పెట్టుకుని ఊరేగమంటారా అది చేసిన పనికి. మనం అనుకున్నట్లు ఏ డాక్టరో అయి ఉంటే తప్పకుండా నెత్తిన పెట్టుకుని ఊరేగే దాన్ని. ఇప్పుడు దీనిని ఇంట్లో పెట్టుకుని ఏ ముఖం పెట్టుకుని బయట తిరగ్గలను? మీ కూతురు ఎవరితోనో లేచిపోయి తిరిగి వచ్చిందిటగా అని ఎవరైనా అడిగితే ఏం సమాధానం చెప్పను" అమ్మ మండిపడుతూ సమాధానమిచ్చింది.

"మీకంత జాలిగా ఉంటే ఏ అనాథ శరణాలయంలోనో చేర్పించండి. అంతేగనీ అది ఇంట్లో ఉండడానికి వీల్లేదు" తేల్చిచెప్పింది అమ్మ.

"ఏ హాస్టల్‌లో అయినా ఉంచి చదివించండి నాన్నగారూ" అన్నయ్య సలహా ఇచ్చాడు.

తన గదివైపు వెళ్తూ నాన్నతో చెప్పింది అమ్మ "మీకు అది కావాలో, నేను కావాలో తేల్చుకోండి"

నేను, నాన్న ఒకరినొకరం చూసుకుంటూ ఉండిపోయాం. కాసేపయ్యాక నాన్న బయటకెళ్లారు. నాకేం చేయాలో అర్థం కాలేదు. ఒక్కసారి స్వంత నిర్ణయంతో అడుగు బయటకేసి ఇన్ని అపవాదులు తెచ్చుకున్నాను. ఇప్పుడు మాత్రం నాన్న ఎలా చెప్తే అలా చేయాలనుకున్నాను. నాన్న నాతో మాట్లాడడం వల్ల నాకు చెప్పలేని ధైర్యం వచ్చింది. చూస్తుండగానే టైమ్ అర్ధరాత్రి అయింది. అంతా మంచి నిద్రలో ఉన్నారు. నాన్న మెల్లగా నా రూమ్‌కొచ్చారు.

"కన్నా! వెళ్దాం రా" నా చేయి పట్టుకున్నారు.

"నాన్నా" ఆందోళనగా అన్నాను.

"పద" నాన్న నన్ను నిశ్శబ్దంలోకి నడిపించారు.

ఎక్కడికి తీసుకువెళ్తున్నారో తెలీదు. అమ్మ చెప్పినట్లు అనాథాశ్రమానికా? అన్నయ్య చెప్పిన హాస్టల్‌కా? చీకట్లో నాన్న చేయి పట్టుకుని నడుస్తున్నాను.

నాన్న నన్ను రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చారు. హైదరాబాద్‌కు టిక్కెట్స్ తీసుకుని ఇద్దరం ట్రైన్ ఎక్కేసాం.

ఎంత విచిత్రం? నిన్న ఇదే ట్రైన్‌లో అతనితో బయలుదేరి కుటుంబ ప్రతిష్ఠ మంటగలిపాను. ఇవాళ ఇదే ట్రైన్‌లో నాన్నతో ఈ ప్రయాణం ఎక్కడికో?

నా మనసులోని ప్రశ్నలు నాన్నగారికి వినిపించాయేమో?

"పవిత్రా! నేను అమ్మను వదులుకుని నీతో వస్తున్నానమ్మా" అన్నారు. హతాశురాలినయ్యాను నేను.

"నాన్నా! నాకోసం మీరు అమ్మను వదులుకోవద్దు. నన్ను ఏ హాస్టల్‌లోనో ఉంచండి చాలు" అన్నాను.

"లేదమ్మా. తప్పదు. అమ్మ తన నిర్ణయం మార్చుకోనందువల్ల నేనీ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఇంకో దారి లేదు. అమ్మకు తోడుగా అన్నయ్యలు ఉన్నారు. నేను నీ వెంట ఉండి నీ చదువు పూర్తయి జీవితంలో స్థిరపడ్డాక అమ్మ దగ్గరకెళతాను.''

నాన్న నేను తలెత్తి చూడలేనంత ఎత్తులో ఉన్నారు.

ఆ క్షణమే నిర్ణయించుకున్నాను. నా మూలంగా తలెత్తుకోలేని నాన్నగారు తిరిగి నా మూలంగానే సగర్వంగా తిరిగేలా నేను ఏదైనా చేయాలని. ఒకరకమైన కసి నాలో బయలుదేరింది.

★★★

నాన్న తిరిగి నన్ను కాలేజీలో చేర్పించారు. నాకిక ఒకటే ధ్యేయం. కూర్చున్నా, నిల్చున్నా, నిద్రపోయినా ఒకటే ధ్యాస. అది మెడిసిన్‌లో సీటు తెచ్చుకోవడం.

రోజుకు ఎన్నిగంటలు చదివానో నాకే తెలీదు. నాకింకో ప్రపంచమే ఉండేదికాదు. చదువు...చదువు...చదువు. ఇరవై నాలుగు గంటలూ కష్టపడ్డాను.

నాన్న నాకన్నివిధాలా సహకరించేవారు. నా తిండీ, ఆరోగ్యం ఆయనే చూసుకునేవారు. తన కంటిరెప్పలా చూసుకునేవారు. ఎన్నోసార్లు అనిపించేది నేను చేసిన తప్పుకు ఏ తండ్రయినా ఎలాంటి శిక్ష విధించేవారో కానీ మా నాన్నగారు నన్నిలా కాపాడుకుంటున్నారు అని. దేవతలు కూడా భూమిపై ఉంటారనడానికి నాన్నే చక్కని నిదర్శనం.

ఇంటర్‌మీడియెట్ పరీక్షలు, ఆ తరువాత మెడికల్ ఎంట్రెన్స్ వ్రాసేవరకూ ఏ రోజూ నేను కంటినిండా నిద్రపోలేదు. నాన్న నాకోసం చేసిన త్యాగానికి ఆయన రుణం తీర్చుకోవడం కోసం అహర్నిశలూ కష్టపడ్డాను. నా శ్రమ వృధా కాలేదు. ఇంటర్మీడియెట్‌లో, ఎంసెట్‌లో రెండింటిలో నాదే ఫస్ట్ ర్యాంక్. ఆ క్షణంలో నాన్నగారి కళ్లల్లో కనిపించిన కాంతులు నేను జీవితంలో మరచిపోలేను. ఆరోజు నాన్నగారి గుండెలమీద పడుకుని తనివి తీరా నిద్రపోయాను.

★★★

నా తపస్సు అంతటితో ఆగిపోలేదు. మెడిసిన్‌లో ప్రతి సబ్జెక్టులో గోల్డ్ మెడల్ నాదే. ఎన్ని మెడల్స్ వచ్చినా నాన్నగారి కంటి వెలుగుల ముందు అవన్నీ దిగదుడుపే.

ఆయన ఆశీర్వాదబలంవల్ల మెడిసిన్, ఆ తరువాత ఎమ్‌డి కార్డియాలజీ నిరాటంకంగా పూర్తిచేసి హైదరాబాద్‌లోని రాజ్ హాస్పిటల్స్‌లో డాక్టర్‌గా చేరాను.

ఉద్యోగంలో చేరి నిరంతరం చేసిన పరిశోధనల ఫలితమే ఈ రోజు ఇంత గొప్ప సన్మానం.

నా వెన్నంటి ఉండి నా ప్రతి విజయానికీ కారణమైన మా నాన్నగారే ఈ అవార్డు తీసుకోవడానికి అర్హులనిపించి రాష్ట్రపతి చేయబోయిన సన్మానాన్ని నాన్నగారికే చేయమని చెప్పాను.

★★★


ఆలోచనల నుండి బయటపడి నాన్నగారివైపు చూసాను. ఆయన ప్రశాంతంగా నిద్ర పోతున్నారు.

నా ప్రతి విజయం వెనుకా ఉన్నది నాన్నే. నా జీవితానికి మార్గదర్శి నాన్నే. నాన్న లేకుండా ఈ రోజు నేను లేను. జీవితంలో అతి దారుణంగా ఓడిపోయిన నన్ను తిరిగి నిలబెట్టి ఇంతటి దాన్ని చేసారు. ఊరూవాడా చివరికి కన్నతల్లి కూడా అసహ్యించుకున్న నన్ను ఈయన గుండెల్లో దాచుకున్నారు.

ఇంతటి మహనీయుడికి నేనేం ఇవ్వగలను? జన్మజన్మలకూ ఈ నాన్ననే నా తండ్రిగా ప్రసాదించమని ఆ భగవంతుడ్ని ప్రార్థించడంతప్ప. ఇది అత్యాశ అని భగవంతుడు అనుకుంటే ఆయన పాదలనంటి ఉండే ధూళి రేణువులా నన్ను పుట్టించినా చాలు, అది నా భాగ్యం అనుకుంటాను.

"తప్పు చేసారని దారుణంగా హింసిస్తే మనకు ఒరిగేదేమీ ఉండదు. అదే ఆ పిల్లల తప్పులను గుండెల్లో దాచుకుని వారు సరైన త్రోవలో నడవడానికి మనం సహకరిస్తే వారి నుంచి అద్భుతమైన విజయాలను సాధించగలం'' నాన్న తన ప్రసంగంలో చెప్పిన మాటలు నా చెవిలో ఇంకా మారుమ్రోగుతూనే ఉన్నాయి.

★



## పరీక్ష ఫెలయిన ఐన్‌స్టీన్

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఫెడరల్ పాలిటెక్నిక్ కోర్సులో చేరటానికి జ్యూరిచ్‌లో ఎంట్రన్స్ పరీక్షకి కూర్చుని దాంట్లో ఫెలయినాడట!

## బేలన్సింగ్ ఏక్రోబేట్స్

ఇటీవల జర్మనీలోని బోన్ నగరంలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరిగిన సమారోహంలో భూమి వాతావరణాన్ని సమతులంగా పరిరక్షించుకోవాలన్న అంశాన్ని బలపరుస్తూ జర్మన్ ఏక్రోబేట్స్ తీగలపై బేలన్సింగ్ చేసారు.

-తటవర్తి

